



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# దుర్గాబాయ్ దేశ్ ముఖ్

## నాలుగవ / చివరి భాగం



నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం, నిర్మాణాత్మకమైన సామాజిక సేవకు ప్రత్యక్ష ప్రమాణం 70 సంవత్సరాల క్రిందటే మహిళా సంక్షేమం గురించి ఆలోచించి, పథకాలను రూపొందించి వాటికి శాశ్వత రూపం కల్పించి గత 70 సంవత్సరాలుగా లక్షలాది మంది మహిళల జీవితాలలో వెలుగును నింపే అనేక సంస్థలకు ఊపిరి పోసిన తెలుగు మహిళాతేజం దుర్గాబాయి దేశ్ ముఖ్ గా అందరికి తెలిసిన దుర్గాబాయమ్మ గారి స్ఫూర్తి దాయకమైన జీవితవిశేషాలు నాలుగవ వారం చివరి భాగం .

*గత మూడు వారాల్లో మనం ఏం మాట్లాడుకున్నామో అతి క్లుప్తంగా తెలుసుకుందాం.1909 లో రాజమండ్రి లో జన్మించిన దుర్గాబాయమ్మ గారు పెరిగిందంతా కాకినాడలో.చాలా చిన్న వయసులోనే ఆవిడ స్కూలు మానేసేసి ఇంగ్లీష్ చదువులు వద్దనుకొని,*

*హిందీ నేర్చుకుంటూ , పిల్లలకు నేర్పుతూ 12 ,13 సంవత్సరాల వయసులోనే కాకినాడలో హిందీ బాలికా పాఠశాల ని స్థాపించారు. చిన్న వయసు నుంచే ఆవిడకు మహిళాభ్యుదయం గురించి , సంఘ సేవ గురించి ఆలోచనలుండేవి.24 సంవత్సరాల వయసుకే ఆమె రాజకీయాల్లో చాలా ప్రముఖంగా పేరు తెచ్చుకోవడం, జైలుకెళ్లి బయటకు రావడం కూడా జరిగాయి. 24 సంవత్సరాల వయసులో ఆవిడ చదువు ప్రారంభించి 32 సంవత్సరాలకి క్రిమినల్ లాయర్ గా బార్ కౌన్సిల్ లో రిజిస్టర్ చేసుకోగలిగారు మద్రాస్ లో.*

*ఆవిడ చదువుకుంటున్న రోజుల్లోనే 1937 ప్రాంతాల్లో మద్రాస్ లో చాలా చిన్నగా లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే చిన్న సంస్థని ప్రారంభించి, దాన్ని ఆంధ్ర మహిళా సభ గా తీర్చిదిద్ది వివిధ కోణాల్లో దాన్ని విస్తరిస్తూ వచ్చారు.1946 నుంచి ఆవిడ ఢిల్లీ కి వెళ్లి అక్కడ ప్రొవిజనల్ పార్లమెంట్ లో సభ్యురాలిగా పనిచేశారు. భారత రాజ్యాంగ నిర్మాణ కమిటీ లో కూడా సభ్యురాలిగా ఉన్నారు.*

*మద్రాసులో సంస్థల్ని కొనసాగిస్తూ, లాయర్ గా కూడా కొనసాగుతూ ఢిల్లీ లో ఈ కమిటీల్లో కొనసాగుతూ స్వాతంత్ర్యం వచ్చాక ఆవిడ ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా కూడా ఎన్నికయ్యారు. ఆ ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా పనిచేస్తున్నప్పుడు అప్పటి ఆర్థిక మంత్రి (ఫైనాన్స్ మినిస్టర్), అలాగే ప్లానింగ్ కమిషన్ లో మరొక సభ్యుడు దేశ్ ముఖ్ గారి తో పరిచయం ఏర్పడింది.సి.డి.దేశ్ ముఖ్.*

*ఆ దేశ్ ముఖ్ గారు అప్పటికి ఎలా వున్నారంటే, ఆయనకి భార్య చనిపోయారు, అప్పటికే 30 సంవత్సరాల కూతురు,ఆవిడ లండన్ లో ఉన్నారు. అప్పటికి సి.డి.దేశ్ ముఖ్ గారు, దుర్గాబాయమ్మ గారు ఇద్దరూ ప్లానింగ్ కమిషన్ లో సభ్యులుగా వున్నారు.*

*ఇంతవరకు క్రిందటివారం తెలుసుకున్నాం. ఈ రోజు మిగతా విశేషాలను తెలుసుకుందాం.*

ఆవిడ ధైర్యం , మద్రాసులో చేస్తున్న కార్యక్రమాలు , అలాగే హిందీ లో అనర్గళంగా మాట్లాడ్డం , ఏ విషయం మాట్లాడినా స్త్రీ సంక్షేమం గురించి, వాటి గురించి ఎలాంటి పథకాలు చేపట్టాలి ఇలాంటివాటి గురించి ఆవిడ నిస్వార్థంగా పార్లమెంటు లో కూడా వాదించడం – ఇలాంటివన్నీ సి.డి.దేశ్ ముఖ్ గారు దగ్గరగా గమనిస్తూ ఉన్నారు. ఒకసారి మద్రాస్ లో ఆంధ్రమహిళా సభకి అనుబంధంగా ప్రసూతి వార్డ్ ను ప్రారంభించి దాని ప్రారంభోత్సవానికి సి.డి.దేశ్ ముఖ్ గారిని మద్రాస్ ఆహ్వానించారు దుర్గాబాయమ్మ గారు. అక్కడ ఆయన ప్రత్యక్షంగా దుర్గాబాయమ్మ గారు చేస్తున్న సాంఘిక సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకోవటానికి అవకాశమేర్పడింది.

1952 నవంబర్ ప్రాంతాల్లో ఒకసారి సి.డి.దేశ్ ముఖ్ గారు దుర్గాబాయమ్మ గారింటికి ఫోన్ చేయించారు సెక్రెటరీ తో. “రేపొకసారి మాయింటికి రాగలరా? మా కుటుంబ సభ్యులకి మిమ్మల్ని పరిచయం చేస్తాను” అని. ఆవిడ ఆశ్చర్యపోయారు. “నన్నెందుకు పరిచయం చేయాలి కుటుంబసభ్యులకు? నేనేదో ప్రణాళికాసంఘంలో పనిచేస్తున్నాం గాని. అయన యింటికెందుకు ఆహ్వానించారు?” అనుకున్నారు కానీ , మరి ఆయన అప్పటికే ఆర్థిక శాఖా మంత్రి , ప్రణాళికా సంఘంలో సీనియర్ సభ్యుడు కాబట్టి ఆవిడ ఆహ్వానాన్ని కాదనకుండా ఇంటికి వెళ్లారు.

1952 నవంబర్ 5 వ తారీఖున. సి.డి.దేశ్ ముఖ్ గారి ఇంటికి వెళ్లారు. అక్కడ సి.డి.దేశ్ ముఖ్ గారి అమ్మగారు, ఆయన చెల్లెలు , మేనకోడలు వీళ్ళందరూ ఉన్నారు. అప్పటికే ఆయన వయసు 60 సంవత్సరాలు. దుర్గాబాయమ్మ గారి వయసు 43 సంవత్సరాలు. వాళ్ళిద్దరికీ 17 సంవత్సరాలు వయసు వ్యత్యాసముంది. అక్కడికి వెళ్ళాక, కాఫీలు త్రాగడం పూర్తయ్యాక , వాళ్ళ కుటుంబ సభ్యులందరికీ పరిచయం చేశారు, ఎందుకింత ప్రత్యేకంగా పరిచయం చేస్తున్నా ఆమెకు అర్థం కాలేదు. ఇద్దరూ మాట్లాడుకుంటూ గార్డెన్ లో నడుచుకుంటూ వెళ్లారు. అదంతా గవర్నమెంట్ ఇచ్చిన పెద్ద బంగ్లా. 15 ఎకరాలుండే విశాలమైన స్థలంలో పది, పదిహేను బెడ్ రూములున్న పెద్ద బంగ్లా. దాంట్లో సి.డి.దేశ్ ముఖ్ గారు , కుటుంబ సభ్యులు ఉంటున్నారు. ఆ తోటలో నడుచుకుంటూ వెళ్ళినప్పుడు ఆయన దుర్గాబాయమ్మ గారితో చెప్పారు. “నాకు చాలా ఒత్తిడిగా ఉంటుంది ఈ ఫైనాన్స్ మినిస్టర్ గా పనిచేయడం,ప్రణాళికా సంఘ సభ్యుడుగా పనిచేయడమునూ. నేను రాజీనామా చేద్దామనుకుంటున్నాను” అని. దుర్గాబాయమ్మ గారు చెప్పారు. “ఎందుకలా అనుకుంటున్నారు?మీకేమైనా సహాయం కావాలంటే ఎప్పుడైనా

నన్ను గుర్తుపెట్టుకోండి.నేను మీకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని. "నా జీవితం లోని శూన్యాన్ని నీవు భర్తీ చేయగలవా?" అని అడిగారు ఆయన. ఆవిడ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు "ఏమిటి ఇలా మాట్లాడుతున్నారు?" అని.

కానీ ఆ మాటల్లోని అంతరార్థం తెలిసిందావిడకి. వెంటనే సమాధానం చెప్పకుండా "నాకు కొంచెం సమయమివ్వండి.నేను ఒకటి రెండు రోజుల్లో మీకు సమాధానం చెబుతాను" అన్నారు. " నా జీవితంలోని శూన్యాన్ని భర్తీచేయడమంటే ఇక దాంట్లో వేరేగా ఆలోచించాల్సిన అవసరంలేదు. నన్ను వివాహం చేసుకుంటావా?" అని పరోక్షంగా అడిగారు. ఆవిడ ఇంటికి వెళ్ళాక ఆలోచించారు. ఆయన చూస్తేనేమో యూరోపియన్ శైలిలో ఉంటారు, ఆయన వేష భాషలు , ఆయన ఆహారపు అలవాట్లు. ప్రణాళికా సంఘపు సభ్యుడుగా గాని, ఆర్థిక మంత్రిగా గాని చాలా ఉన్నతమైన స్థాయిలో ఉన్నారు. ఇటు తన సంగతి చూస్తేనేమో అప్పటిక్కూడా దుర్గాబాయమ్మ గారు పల్లెటూరి మహిళలాగే ఉండేవాళ్ళు.ఆవిడ వేష భాషలు గాని,ఈ ముతక చీరలు గాని , మాట్లాడ్డం గాని వ్యవహార శైలి గాని ఆహార విషయాలు గాని ఇవన్నీ కూడా పల్లెటూరి మహిళగానే ఉండేవాళ్ళు. "నేనాయనకు సరిపోతానా? ఈ వయసులో నేనాయనను వివాహం చేసుకోవాలా? వివాహం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులెదురవుతాయి? పైగా నేను చేసేటటువంటి సేవాకార్యక్రమాలకేమైనా ఇబ్బందోస్తుందా?" ఇలాంటివన్నీ ఆవిడ ఆలోచించారు. చివరికి ఎలాగైతే సుముఖంగానే సమాధానం చెబుదామని నిర్ణయించుకొని ఆ మరురోజు మళ్ళా ఆయన ఇంటికెళ్ళారు.

ఆయనకీ చెప్పారు. "చూడండి! ఇవన్నీ కూడా నా ఆలోచనలు. నేను మీకు సరిపోతానో లేనో నాకు తెలియదు. ఎందుకంటే నా ఆహార వ్యవహారాలు, నా భాషా శైలి ఇలా ఉంటుంది. మీరేమో చాలా పాశ్చాత్త్య ధోరణితో ఉంటారు. అది నాకు కొంచెం అనుమానంగా ఉంది" అని ఆవిడ చెప్పారు. ఆయన వేరే ఏమి మాట్లాడకుండా ఒక యూకలిప్టస్ చెట్టు ఉంటె ఆ చెట్టుదగ్గరికెళ్ళి దానిమీద ఒక సంస్కృత శ్లోకాన్ని రాశారాయన.ఆ సంస్కృత శ్లోకం అర్థమేమిటంటే, ఎలాంటి దానివైనా కానీ నిన్ను నా భాగస్వామిగా స్వీకరిస్తాను అనే అర్థం వచ్చేలాగా. ఆయన సంస్కృతంలో చాలా పెద్ద పండితులు..సంస్కృత కవి సమ్మేళనాల్లో కూడా పాల్గొంటూ ఉండేవాళ్ళు. ఆ విధంగా వాళ్లిద్దరూ ఒకళ్ళ మనసులో భావాన్ని ఒకరికి తెలియజేసుకున్నట్లుగా అయ్యింది. దాంతోటి దుర్గాబాయమ్మ గారు కూడా ఇక కాదనకుండా సరే అన్నారు

మొట్టమొదటి సారిగా జవహర్ లాల్ నెహ్రు గారికి చెప్పారు. ఎందుకంటే, ఇద్దరికీ కూడా ఆయన శ్రేయోభిలాషి , ఇద్దరికీ పదవులిచ్చింది వీళ్ళ యొక్కఆ పురోగతిని సమీక్షిస్తుంది కూడా జవహర్ లాల్ నెహ్రు గారే. ఆయన చాలా ఆనందించారు. ఎందుకంటే, ఈ సమయంలో సి.డి.దేశ్ ముఖ్ గారికి కూడా తోడు కావాలి , "నువ్వు కూడా వంటరిగా పోరాటం చేస్తున్నావు , ఈ సాంఘిక సంక్షేమ కార్యక్రమాలతో" అని నెహ్రు గారు కూడా వాళ్ళ ఇద్దరి యొక్క ప్రతిపాదనని బలపరిచారు.

ఆ విధంగా నెహ్రు గారి ఆశీస్సులు కూడా తీసికొని 1953 జనవరి 22 న వాళ్లిద్దరూ వివాహం చేసుకున్నారు. అది కూడా చాలా తక్కువ మంది, జవహర్ లాల్ నెహ్రు కుటుంబ సభ్యులందరూ వచ్చారు.ఇందిరా గాంధీ గారు, జవహర్ లాల్ నెహ్రు గారి చెల్లెల్లు వాళ్ళందరూ వచ్చారు. అప్పట్నుంచి దుర్గాబాయమ్మ గారు దుర్గాబాయి దేశ్ ముఖ్ గా మారారు. ఆ రోజుల్లో వాళ్లిద్దరూ వివాహం చేసుకోవడమనేది చాలా సంచలనాత్మకమైన విషయం. ఎందుకంటే, ఇద్దరికీ కూడా దేశవ్యాప్తంగా పేరు ఉంది. ఆయనేమో ఆర్థిక శాఖా మంత్రి, ప్రణాళికా సంఘం సభ్యులు.దుర్గాబాయమ్మ గారేమో అప్పటికే ఆంధ్రమహిళాసభ ద్వారానూ, అలాగే రాజకీయాల్లోనూ కూడా చాలా పేరుంది. పేపర్ లన్నిటిలోనూ ప్రముఖంగా రాశారు వీళ్లిద్దరూ వివాహం చేసుకున్న విషయాన్ని.శంకర్స్ వీక్లీ అనే మ్యాగజైన్ వచ్చేది. అందులో శంకర్ అనే ఒకాయన రాజకీయ కార్టూన్లు వేస్తూ ఉండేవాళ్ళు. వీళ్లిద్దరికీ వివాహమైన సందర్భంలో ఆయన ఒక కార్టూన్ వేశారు. ఏమిటంటే,సి.డి.దేశ్ ముఖ్ గారు కోట్ వేసుకొని నిల్చుంటారు, పక్కన పారిశ్రామిక వేత్తలుంటారు, ఆయన తన చేతిని పారిశ్రామిక వేత్తల జేబులో పెట్టారు,ఇటు పక్కన దుర్గాబాయమ్మ గారు మామూలుగా ముతక చీర కట్టుకుని వుంటారు , ఆవిడ తన చేతిని సి.డి.దేశ్ ముఖ్ గారి కోట్ జేబులో పెట్టారు , దుర్గాబాయమ్మ గారి పక్కనే సామాన్యమైనటువంటి పౌరులు, మహిళలు ఉన్నారు వాళ్ళు చేతులు చాచి దుర్గాబాయమ్మ దగ్గర నిల్చున్నారు

.అది కార్టూన్.అంటే,సి.డి.దేశ్ ముఖ్ గారేమో పారిశ్రామిక వేత్తల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు, దానిలో కొంత భాగం దుర్గాబాయమ్మగారికొస్తుంది.దుర్గాబాయమ్మ గారు వాటిని ఈ ఆంధ్రమహిళాసభ ద్వారా ఈ పేదలకిఇప్పిస్తున్నారు. అర్హులైన వాళ్లకి ఇస్తున్నారు అనేటటువంటి అర్థం వచ్చే కార్టూన్ వేశారు ప్రముఖ కార్టూనిస్ట్ శంకర్.

అప్పటికి దుర్గాబాయమ్మ గారు కేవలం ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగానే కాకుండా , సోషల్ వెల్ఫేర్ బోర్డు అనే దాన్ని మొట్టమొదటిసారిగా ప్రారంభించి చైర్మన్ గా కూడా ఉన్నారు. ఆ విధంగా ఆవిడకి రెండు పదవులు ఉన్నాయి. సి.డి.దేశ్ ముఖ్ గారికి కూడా ఆర్థిక శాఖా మంత్రి , ప్రణాళికా సంఘం సభ్యుడు. ఆయనకీ రెండు పదవులున్నాయి. వీళ్లకు వివాహమయ్యాక దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు నెహ్రూ గారితో చెప్పారు. "ఏమండీ మేమిద్దరమూ కూడా ప్రణాళికా సంఘంలో ఉండడమెందుకు? ఒకళ్ళం రాజీనామా చేస్తాము" అని. నెహ్రూగారు చెప్పారు " మీరు ప్రణాళికా సంఘపు సభ్యులయ్యాక వివాహం చేసుకున్నారు కానీ వివాహమయ్యాక మీ ఇద్దర్నీ అందులో పెట్టలేదు కదా! అందువల్ల మీరు ఏదో నైతిక విరుద్ధమని అనుకోవద్దు. మీ ఇద్దరూ కూడా కొనసాగాలి, మీరిద్దరూ కూడా సమర్థవంతమైన వ్యక్తులు" అని వారిద్దరికీ కూడా నచ్చచెప్పి వారిద్దరూ ఆ ప్రణాళికా సంఘంలో కొనసాగేలా చేశారు. ఆ తర్వాత 10 సంవత్సరాల పాటు ప్రణాళికా సంఘం కొనసాగింది. ఆ తర్వాత సి.డి.దేశ్ ముఖ్ గారు కూడా ఈ ఆర్థిక మంత్రి అయిపోయాక యు.జి.సి. వైస్ చైర్మన్ గానూ, ఢిల్లీ యూనివర్సిటీ ఛాన్సలర్ గానూ, నేషనల్ బుక్ ట్రస్ట్ అధికారిగానూ.. ఇన్ని పదవులలో ఆయన కొనసాగుతూ వచ్చారు. ఎందుకంటే ఇద్దరికీ కూడా మచ్చలేనటువంటి అధికారులు, నిజాయితీ గల అధికారులు , సమర్థమైనటువంటి అధికారులు అని దేశమంతా కూడా పేరుంది. ఇద్దరి మీదా ఎక్కడా ఒక్క ఆరోపణ కూడా రాలేదు, అన్ని సంవత్సరాల్లో. ఇంకొక చాలా నిజాయితీ గల నిర్ణయం ఏమి తీసుకున్నారంటే, "ఇద్దరమూ కూడా గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాము కాబట్టి ఎవరో ఒకళ్ళమే జీతం తీసుకుంటామ"ని వాళ్ళల్లో ఒకళ్ళు మాత్రమే జీతంతీసికొని మరొకరు కేవలం ఒక రూపాయి మాత్రమే నామ మాత్రమైన పారితోషికం కొనసాగించారు. జీవితాంతం కూడా అలాగే ఉన్నారు. .నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం , నిస్వార్థతకి ప్రత్యక్ష ప్రమాణం అంటే ఇలాంటివే ఉదాహరణలు.

వివాహం అయిన దగ్గర్నుంచి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు, సి.డి.దేశ్ ముఖ్ గారు కలిసి చేసిన సంక్షేమకార్యక్రమాలు.. అలాగే వాళ్ళ యొక్క వ్యక్తిగత జీవితం రెండు కోణాల్లో చూసినట్లయితే –

వ్యక్తిగత జీవితం విషయానికొస్తే; వివాహమయ్యాక దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు తాను నివాసముంటున్న క్వార్టర్ ని ఖాళీచేసి వన్ వెల్లింగ్టన్ క్రిసెంట్ రోడ్ మారారు. అది అప్పటికే సి.డి.దేశ్ ముఖ్ గారు ఉంటున్న పెద్ద బంగ్లా. దాని ఆవరణలో 350 యూకలిఫ్టస్ చెట్లు ,17 సర్వెంట్ క్వార్టర్స్, బోల్డన్ని బెడ్ రూములు ఐదెకరాల స్థలం ఇదంతా ఉండేది. ఈవిడ వెళ్ళాక వంట వాళ్ళని కూడా తగ్గించి తనే వంట చేయడం ప్రారంభించారు.అయితే ఆహారపు అలవాట్లలో ఇద్దరికీ కూడా వ్యత్యాసాలున్నాయి. ఆయనేమో మాంసాహారి, ఈవిడేమో శాఖాహారి. అయినా కానీ ఇద్దరిమధ్యన ఎప్పుడూ ఎలాంటి పొరపొచ్చాలు రాలేదు. ఎందుకంటే,ఇద్దరి ఆలోచనలు , ఇద్దరి యొక్క ఆశయాలు కూడా ఒకే విధంగా కొనసాగాయి. ఇద్దరూ కలిసి ఆర్థిక శాఖా మంత్రి బంగ్లాలో నివసించటం.. భార్యాభర్తలుగా ఉన్నాక అటువైపు నుంచి సి.డి.దేశ్ ముఖ్ గారి బంధువులు,ఇటువైపు నుంచి దుర్గాబాయమ్మ గారి బంధువులు అంటే వాళ్ళ అమ్మ, తమ్ముడు,తమ్ముడు గారి పిల్లలు వారానికొకళ్ళొచ్చి ఉండడం ఎప్పుడూ కూడా వాళ్ళ ఇల్లు కళకళలాడుతూ ఉండేది. అటువైపు వాళ్ళని, ఇటువైపు వాళ్ళని కూడా చాలా ఆదరంగా చూస్తూ ఉండేవాళ్ళు దుర్గాబాయమ్మగారు. మొట్టమొదట్లో దుర్గాబాయమ్మ గారి అమ్మగారు అనుమానించారట."ఈయనేమో చాలా యూరోపియన్ స్టైల్ లో ఉండేటటువంటి ఆయన. ఆయనకీ , మా అమ్మాయికి కుదురుతుందా? మొట్టమొదటిసారి చిన్నప్పుడు కూడా ఇలాగా ఆవిడ వివాహం విషయంలో పొరపాటు జరిగింది. ఇప్పుడు కూడా అలా అవుతుందేమో!?" అనుకున్నారు. కానీ వివాహమయ్యాక ఆయన్నికొడుకు కంటే ఎక్కువగా ఆవిడ చూసుకున్నారు. ఆయన కూడా అత్తగారనేకంటే తల్లిగా కూడా కృష్ణవేణమ్మ గారిని చూసుకొన్నారు.

దుర్గాబాయమ్మ గారు చేసిన ఇంకొక మహత్తమైనటువంటి కార్యక్రమం, వివాహమయ్యాక తండ్రికి దాదాపుగా 30 సంవత్సరాలుగా దూరంగా లండన్ లో ఉంటున్నటువంటి కూతురు ప్రిమ్ రోజ్ (ఆవిడ్ని కినిక అని చాలా ముద్దుగా పిలుచుకుంటుండేవాళ్లు)కి ఉత్తరాలు రాసి ఆవిడకి, తండ్రికి మధ్య నున్నటువంటి పొరపొచ్చాలు సమసిపోయేలా చేసి, ఆవిడను తండ్రికి దగ్గర చేశారు. దుర్గాబాయమ్మ గారు కేవలం సంఘసంక్షేమమే కాకుండా మానవత్వం దృష్ట్యాకూడా తండ్రీ కూతుళ్లను దగ్గర చేశారు.

మొట్టమొదటి వారం చెప్పుకున్నాం.ఆవిడ ప్రథమ వివాహం చేసుకున్న భర్త వివాహం చేసుకున్న రెండవ భార్యను కూడా భర్త మరణించాక తన దగ్గరికి తీసుకొచ్చి తన శిక్షణాలయంలోనే శిక్షణ ఇచ్చి జీవితాంతం తన తోటే ఉంచుకున్నారు. ఆవిడ మానవత్వానికి అదొక అద్భుతమైనటువంటి నిదర్శనం.

దుర్గాబాయమ్మ గారు వివాహమయ్యాక తనకు ప్రైవేట్ సెక్రెటరీ గా ఎలిజబెత్ అజరయ్యఅని ఒకామె ను తెచ్చుకున్నారు. ఆ ఎలిజబెత్ అజరయ్య అనే ఆవిడ దుర్గాబాయమ్మ గారితో పాటుగా కలిసి మద్రాస్ లో లా చదువుకున్నారు. అయితే ఆవిడకి నలుగురు పిల్లలు. నలుగురు పిల్లలతోటి లా చదవటానికి చాలా కష్టపడుతూ ఉండేవాళ్ళు. ఆ తర్వాత కూడా ఆర్థిక ఇన్నందుల్లో ఉంటె, ఆవిడ్ని తీసుకొచ్చి తనకు సెక్రెటరీగా ఉంచుకొని వాళ్ళ పిల్లలందరూ కూడా జీవితంలో స్థిరపడేలాగా సహాయం చేశారు దుర్గాబాయమ్మ గారు.

కేవలం ఆంధ్రమహిళా సభ దానికి అనుబంధ మైన సంస్థలే కాకుండా దుర్గాబాయమ్మ గారు సి.డి.దేశ్ ముఖ్ గారు కలిసి చేసిన సహాయాలతో బోల్డన్ని సంస్థలు చాలా మంచి స్థితికి వచ్చాయి. వాటిల్లో కొన్ని ఉదాహరణగా చెప్పుకోవాలంటే– మద్రాస్ లో కాన్సర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మద్రాస్ 1955 ప్రాంతాలకే ఉంది. డాక్టర్ ముత్తు లక్ష్మీ రెడ్డి గారు ప్రారంభించారు. కానీ సరైనటువంటి నిధులు సమీకరించలేకపోయారు. దుర్గాబాయమ్మ గారు సి.డి.దేశ్ ముఖ్ గారితోటి చెప్పి కాన్సర్ ఇన్స్టిట్యూట్ కి నిధులిచ్చి దాన్ని నిలదొక్కుకునేలాగా చేశారు. అప్పటివరకూ కూడా ఫైలేరియా , కుష్ఠు ఇలాంటి వాటికి ప్రత్యేకమైన విభాగముండేది కాదు. దాని కోసమని ప్రత్యేకంగా కొన్ని నిధుల్ని కేటాయింపచేసి వాటికోసం కృషిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకి ఇప్పించారు దుర్గాబాయమ్మ గారు. అలాగే అదే రోజుల్లో ఢిల్లీ లో అల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రారంభించడానికి కూడా కృషి చేశారు దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు. అలాగే నేషనల్ స్మాల్ సేవింగ్స్ కమిటీ అప్పట్లోనే ప్రారంభమైంది. దానికి చైర్మన్ గా ఉండి, దాని ద్వారా కూడా కృషి చేశారు.

కేవలం మనకు ఆంధ్రమహిళాసభ ఒక్కటే కనిపిస్తుంది కానీ పరోక్షంగా ఆవిడ బలపర్చినటువంటి సంస్థలు, స్థిరపర్చినటువంటి సంస్థలు అనేకం ఉన్నాయి. అలాగే ఈ రోజు భారతదేశంలో మహిళాసంక్షేమం గురించి చట్టాలు కానీ అలాగే సంస్థలు కానీ వేటిగురించి మాటలాడుకున్నా గాని వాటి వెనకాల దుర్గాబాయమ్మ గారి యొక్క హస్తం ప్రత్యేక్షంగానో, పరోక్షంగానో ఎక్కడోచోట ఉండే ఉంటుంది. ఆంధ్రా యూనివర్సిటీ లో లేడీస్ హాస్టల్ పెట్టడానికి కూడా దుర్గాబాయమ్మ గారే తొలి బీజం వేశారని చెప్పుకున్నాం కదా. సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా ఉన్నప్పుడు దాదాపుగా దేశవ్యాప్తంగా లక్షన్నర స్వచ్ఛంద సేవా సంస్థల్ని ప్రారంభింప చేసి, గ్రామసేవికులు అనే ఉద్యోగాలు కూడా కల్పించారు. ఇవన్నీ కూడా దుర్గాబాయమ్మ గారు చేసినటువంటి నిస్వార్థమైన సేవకి ప్రత్యక్ష మైనటువంటి నిదర్శనాలు.

ఆయన, ఆవిడ కలిసి చాలా దేశాలు పర్యటించారు. అమెరికా పర్యటించారు,అలాగే యూ.యన్.ఓ లో ప్రసంగించారు. ఆలోచిస్తే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఎక్కడో కాకినాడలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో అతి సాధారణమైన మహిళగా పుట్టి పెరిగినటువంటి దుర్గాబాయమ్మ గారు యూ.యన్.ఓ లో ప్రసంగించారు ఇంగ్లీషులో!! అదికూడా తర్వాత నేర్చుకున్నదే. జెనీవా, బాంగ్కాక్,జపాన్,మాస్కో ఏ విదేశాలకెళ్లినా కానీ ఆవిడ పరిశీలనంతా కూడా మహిళా సంక్షేమం కోసం ఏం చేస్తున్నారు, ఇలాంటివి భారతదేశంలో ఎలా అమలు పరచవచ్చు అనే. చికాగో వచ్చినప్పుడు అక్కడ డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అనే సంస్థ ద్వారా నడుస్తున్న వికలాంగుల

రిహాబిలియేషన్ సెంటర్ లను చూచి, దాని మార్గదర్శక సూత్రాల తోటి ఆవిడ మద్రాస్ లో కూడా అలాంటిదే ప్రారంభించారు ఆంధ్ర మహిళా సభకి అనుబంధంగా.

1962 వచ్చేసరికి ఆవిడ ఆ పదవులన్నీ కూడా చిట్టచివరకొచాయి. సి.డి.దేశ్ ముఖ్ గారు మాత్రం పదవుల్లో కనసాగుతున్నారు. ఆవిడ సోషల్ వెల్ఫేర్ కమిటీ అయిపోయాక మళ్ళీ కొన్నాళ్ళు సుప్రీమ్ కోర్ట్ లో లాయర్ గా ప్రాక్టీస్ చేశారు. "ఇన్ని సంవత్సరాలు మానేశాను కదా, ఎలాంటి కేసులొస్తాయో!" అనుకున్నారు కానీ అప్పటిక్కూడా ఆవిడ చాలా కీలకమైనటువంటి కేసులు కొన్నిటిని వాదించగలిగారు. 1964 ,65 సంవత్సరాలు వచ్చేసరికి ఆవిడ హైదరాబాద్ వెళ్లారు ఒకసారి.అక్కడ వాళ్ళ తమ్ముడిగారమ్మాయి లీల ఉన్నారు. వాళ్ళ తమ్ముడి గారి అల్లుడు మాధవరావు బాజీ ఆయన రాష్ట్ర రోడ్ రవాణా సంస్థలో పనిచేస్తూ ఉండేవాళ్ళు. అక్కడికెళ్ళినప్పుడు హైదరాబాద్ లో ఉన్న పరిస్థితులు చూసి "ఇక్కడ మహిళల యొక్క సంక్షేమానికి చాలా కృషిచేయాల్సినటువంటి అవసరం ఉంది వెనుక బడినతనం ఎక్కువగా ఉంది తెలంగాణాలో" అని ఆవిడ హైదరాబాద్ లో కూడా ఈ ఆంధ్రమహిళా సభ బ్రాంచ్ ని ప్రారంభింపచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పక్కనే రాళ్ళూ,రప్పలూ ఉన్న ఖాళీ స్థలంలో ఓ ప్లాట్ తీసుకున్నారు. వాళ్ళ అమ్మగారు కూడా చెప్పారు. "నీవు హైద్రాబాద్లో సెటిలయితే బాగుంటుంది.ఢిల్లీ కంటే .మనం మద్రాస్ లో చేశాము సేవా కార్యక్రమాలు.హైదరాబాద్ లో కూడా చేస్తే బావుంటుంది" అని.

దేశ్ ముఖ్ గారు కూడా రిటైరయ్యాక, ఇద్దరూ కలిసి హైదరాబాద్ వచ్చారు 1965 ప్రాంతాల్లో. 66 లో ప్రారంభించి 67 లో వాళ్ళ ఇల్లు కట్టుకోవడం అయ్యింది. ఆ కాలనీ లో మొట్టమొదటగా ఇల్లు కట్టుకొన్న ఆయన పేరు డి.యస్.రెడ్డి గారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ఉండేవాళ్ళు. రెండో ఇల్లేమో మండూరి బాపిరాజు అని హై కోర్ట్ జడ్జి. మూడో ఇల్లు దుర్గాబాయమ్మ గారు, సి.డి.దేశ్ ముఖ్ గారు కలిసి కట్టుకున్నటువంటి ఇల్లు. 1200 గజాల స్థలం. ఆ ఇల్లు కట్టుకున్నాక దాంట్లో బోలెడన్ని పూల మొక్కలు, పండ్ల తోటలు ఇవన్నీ వేశారు.

ఒకరోజు మునిసిపల్ కమీషనర్ గారు ఫోన్ చేసి "ఏమండీ మీరు ఉండే కాలనీ కి దుర్గాబాయి దేశముఖ్ కాలనీ అని పేరు పెడతాము" అన్నారు. ఆవిడన్నారు "ఎందుకండీ!నా పేరు పెట్టడం ఇంకా చాలామంది ఉన్నారు కదా సహాయం చేసినటువంటి వాళ్ళు" అని. డి.డి.కాలనీ ఆ విధంగా ప్రారంభమైంది.

అక్కడ్నుంచి మొదలై అంటే 1967 నుంచి ఆవిడ మరణించేంతవరకు కూడ అంటే 14 ,15 సంవత్సరాలు ఆవిడ హైదరాబాద్ నే కార్యక్షేత్రంగా చేసుకొని తన కార్యక్రమాలను కొనసాగించింది. మద్రాస్ లో ఆంధ్రమహిళాసభ కొనసాగుతూనే వుంది.

ఆవిడ జీవితంలో నేర్చుకున్నటువంటి పాఠాల్లో ఒకటి చెప్పారు– "సంస్థను స్థాపించటం.. సమర్థులైనటువంటి వ్యక్తుల చేతిలో పెట్టడం అంతే కానీ దాంతో నేను కలకాలం కొనసాగాలని,దానిమీద నా అజమాయిషీ ఉండాలని అనుకునే దాన్ని కాను అందుకనే మద్రాస్ లో సమర్థవంతులైనటువంటి వ్యక్తుల చేతిలో పెట్టాక , నేను హైదరాబాద్ లో కార్యక్రమాలు కొనసాగించాను" అని చెప్పుకున్నారు. 67 నుంచి ఆంధ్రమహిళాసభ ను విస్తరిస్తూ వచ్చారు. ఆవిడ కార్యక్రమాలు కొనసాగుతున్న రోజులలో 1977 అంటే 10 సంవత్సరాలు ముందుకెళ్తే హఠాత్తుగా సి.డి.దేశ్ ముఖ్ గారికి అనారోగ్యం చేసింది. గుండె జబ్బు అన్నారు. అప్పట్లో గుండె జబ్బుకు తగినటువంటి వైద్యం చేసే సదుపాయాలూ హైదరాబాద్ లో ఎక్కడా లేవు. అక్కడ్నుంచి బొంబాయి తీసికెళ్ళాల్సొచ్చింది. బొంబాయి లో టాటా మెమోరియల్ హాస్పిటల్ లో ఆపరేషన్స్ చేశారు. దాదాపుగా ఒక నెల,రెండు నెలలపాటు బొంబాయి లో ఉండాల్సివచ్చింది.

ఆయన హాస్పిటల్లో ఉన్న రోజుల్లో దుర్గాబాయమ్మ గారికి ఒకసారి తన జీవితం గురించి ఆలోచించుకున్నారు. "అవును నేను ఇన్ని సంఘ సేవా కార్యక్రమాలు చేస్తున్నాను ఇప్పుడేమో ఈయనకు అనారోగ్యంగా ఉంది నాకూ వయసైపోతుంది తర్వాత నా జీవితం ఎలా ఉంటుందో ఏమిటో?" అని ఒకసారి ఆవిడ ఆలోచించుకొని తన జీవితంలో జరిగినటువంటి సంఘటనలన్నిటికి కూడా పుస్తక రూపం లో

ఇస్తే బావుంటుంది మనసు కూడా పరిపరివిధాల ఆలోచిస్తుంది. అలా కాకుండా ఒక ఏవాగేషన్ ఉంటె బాగుంటుంది అని అనుకొని – ఆయన హాస్పిటల్ లో ఉండగా బొంబాయిలో దుర్గాబాయమ్మ గారు "చింతామన్ అండ్ ఐ" అని ఒక పుస్తకం రాశారు.

ఇప్పుడు ఈ నాలుగు భాగాలుగా మీకు చెప్తున్న విశేషాలన్నీ ఆ పుస్తకం లోనుంచే నండి! ఆవిడ మరి కొన్ని పుస్తకాలు కూడా రాశారు. ఆంధ్ర మహిళా సభ ఎలా పెరుగుతుందీ అనే విశేషాలతో ఇంకో పుస్తకం రాశారు. చింతామన్ అండ్ ఐ అనేది ఆవిడ జీవితం లోని విశేషాలు ఎక్కువగా రాశారు

బొంబాయి లో భర్త కి హృద్రోగానికి ఆపరేషన్ చేసినప్పుడు ఆవిడ ఆలోచించారు "అవును మాకంటే డబ్బులున్నాయి , బొంబాయి వెళ్లి వైద్యం చేయించుకోగలిగాము. మరి ఏమీ లేని వాళ్లకు వైద్య సౌకర్యాలు హైదరాబాద్ లో లేనివాళ్లు ఏమౌతారు? వాళ్ళ ఆరోగ్యం ఇలాగే ఉండాల్సిందేనా?" అని ఆలోచించి ఆయనకు చికిత్స అయిపోయాక , 77 ప్రాంతాల్లోనే ప్రయత్నాలు ప్రారంభించి ఆంధ్ర మహిళా సభకి అనుబంధంగా కార్డో వాస్క్యులర్ విభాగాన్ని ప్రారంభించారు.ఆ విభాగం ప్రారంభించడానికి కూడా నిధులు ఎలా సేకరించారో ఏమిటీ అన్నది వివరంగా రాశారు. ఇవన్నీ కూడా దాతలిచ్చినటువంటి విరాళాలు, ఆ తర్వాత గవర్నమెంట్ ఇచ్చినటువంటి గ్రాంటు.

రెండు సంవత్సరాల్లో కేవలం అంటే 1977 లో ప్రారంభించి,1979 కల్లా ఆమె ఆ హాస్పిటల్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆ రెండు సంవత్సరాల్లో కార్డో వాస్క్యులర్ యూనిట్ ని కూడా ప్రారంభింప చేశాక, మరొక రెండు సంవత్సరాలకే తన తుదిరోజులొస్తాయని ఆవిడ ఊహించలేదు. కాకపోతే ప్రతి క్షణం, ప్రతి నిముషం ఆవిడ ఆలోచనలన్నీ "ఇంకా ఏమి సంక్షేమ కార్యక్రమాలు చేయాలి, ఇంకా ముందుకు ఎలా తీసికెళ్ళాలి?" అనేదే. అప్పటికి ఆవిడ నిర్మించిన సంస్థల విలువ – రియల్ ఎస్టేట్ క స్థలాలు, భవనాలూ కాకుండా – కోటీ నలభై లక్షల రూపాయలు. అందులో 75 శాతం దాతలిచ్చినటువంటి విరాళాలు,25 శాతం గవర్నమెంట్ ఇచ్చినటువంటి ఆ నిధులు.

క్రమేణా ఆవిడ ఆరోగ్యం కూడా దెబ్బతినడం ప్రారంభించింది .తను అనారోగ్యం పాలవ్వడం, భర్త అప్పుడే హృద్రోగం నుంచి కోలుకోవడం ఇవన్నీ చూసి ఆవిడ "మళ్ళా ఎప్పుడు ఏమౌతుందో" నని అనుకున్నారేమో కానీ తన ఇంటిని కూడా ప్రభుత్వానికి రాసి ఇచ్చేశారు. ఎంత త్యాగమో ఆలోచించండి..!

జీవితంలో ఏవీ మిగిల్చుకోలేదావిడ.11 సంవత్సరాల వయసునుంచి ప్రతిక్షణం మహిళల గురించి, పరోపకారం, సంఘసేవ గురించి ఆలోచిస్తూ ఇన్ని సంస్థల్ని స్థాపించి వాటినీ ప్రభుత్వానికే ధారాదత్తం చేసి ఇంటిని కూడా గవర్నమెంట్ కి రాసిచ్చేశారావిడ బ్రతికి ఉండగానే. 1981 వచ్చింది అప్పటికే ఆవిడకి అనారోగ్యం బాగా పెరిగింది. చిట్ట చివరి రోజుల్లో ఆవిడకి డయాబెటిస్ ఎక్కువగా ఉండడం వల్ల కళ్ళు కూడా సరిగా కనిపించేవి కాదట. అందుకని మంచం మీదే పడుకొని ఉంటే, సి.డి.దేశ్ ముఖ్ గారు అన్నం కలిపి ఇస్తూ ఉండేవాళ్ళట. ఆ రోజుల్లో కూడా ఆవిడ మంచం మీద పడుకొని కళ్ళు కూడా కనిపించనటువంటి రోజుల్లో కూడా అక్కడనుంచే అన్ని ఆదేశాలిస్తూ సంస్థలన్నీ కొనసాగించారు.

అదేరోజుల్లో వింజమూరి అనసూయాదేవి గారు వెళితే ఆవిడను కూర్చోబెట్టుకుని "అమ్మా ఒకసారి కృష్ణశాస్త్రి గారి పాటలు పాడు" అని పాడించుకున్నారట. వెళ్ళేటప్పుడు ఒక చీర పెట్టి "నేను చేతుల్తో ఇవ్వలేకపోతున్నాను." అని బాధపడ్డారట.

1981 మే ప్రాంతాలు వచ్చేసరికి ఒక రోజు మున్సిపల్ కమీషనర్ గారికి ఫోన్ చేసి "ఏమండీ నా ఆరోగ్యం సరిగా లేదు ఎప్పుడేమవుతుందో తెలియటంలేదు. అంతరాత్మ ఏదో చెబుతున్నట్లుగా ఉంది. ఎలెక్ట్రికల్ క్రిమెటోరియం (విద్యుద్దహన వాటిక) సరిగా పనిచేస్తుందా?" అని అడిగి ఖరారు చేసుకున్నారట. సరిగా ఆ ఫోన్ చేసిన నాలుగో రోజునో. ఐదో రోజునో ఆవిడ మరణించారు.1981 మే లో.

మహిళా సంక్షేమం కోసం ఆవిడ స్థాపించిన విస్తృతమైన సామ్రాజ్యాన్ని, ఈ ప్రపంచానికి వదిలి ఆవిడ మరోప్రపంచానికి మహాభినిష్క్రమణ చేశారు. మరో సంవత్సరానికి సి.డి.దేశ్ ముఖ్ గారు కూడా మరణించారు. 1981 ,82 తో వాళ్ళు ఇద్దరూ భౌతికంగా ఈ లోకాన్ని విడిచి వెళ్లినప్పటికీ వాళ్ళు వదిలి వెళ్లిన సంస్థలు మాత్రం ఈ రోజు వరకూ కూడా మహిళా సంక్షేమం కొరకు , మహిళా ప్రగతి కోసం ఎన్నో సేవలు చేస్తున్నాయి.

ఈ చింతామన్ అండ్ ఐ అనేటటువంటి పుస్తకం చివర్లో సమ్మింగ్ అప్ అనే ఒక అధ్యాయం రాశారు దుర్గాబాయమ్మ గారు. దాంట్లో ఆవిడ నేర్చుకున్నటువంటి పాఠాలు , జీవితం నేర్పిన గుణపాఠాలు వీటన్నింటిని గురించి కూడా క్లుప్తంగా రాశారు. నిజానికి ఈ ఒక్క అధ్యాయం ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథం లాగ మానెజ్మెంట్ చదువుకునేటటువంటి విద్యార్థులకి ఉపయోగపడే ఆదర్శసూత్రాల్లాగా కనిపిస్తుంది.

ఈ విషయాలు చెప్పబోయే ముందు ఇంకొకటి చెప్తాను. దుర్గాబాయమ్మ గారు ఇలాగ హైదరాబాద్ లో అనారోగ్యం తోటి ఆవిడ మంచం మీద నుంచి లేవలేనటువంటి పరిస్థితుల్లో ఉన్న రోజుల్లో ఆవిడకి పి.జి.హాఫ్ మాన్ అవార్డు ( సాంఘీక సంక్షేమం గురించి ముఖ్యంగా ఈ మహిళల యొక్క ఆర్థిక స్థితగతుల్ని మెరుగు పరచడం కోసం చేసినటువంటి సేవలకు గానూ 46 దేశాలనుంచి ఎంపిక చేసినటువంటి ప్రతినిధుల్లో దుర్గాబాయమ్మ గారికి ఆ బహుమతి) వచ్చింది. ఆ బహుమతి ఇవ్వడానికని అధికారులు ప్రత్యేకంగా హైదరాబాద్ వచ్చి ఆవిడ ఇంటిదగ్గర ఆవిడకి బహుమతిని అందించారు. అలాగే యునెస్కో వరల్డ్ పీస్ మెడల్ కూడా ఆవిడకిచ్చారు.రామన్ మెగసెసే అవార్డు కూడా వచ్చింది. ఇవన్నీ కూడా ఆమెకి అధికారికంగా ప్రపంచవ్యాప్తంగా ఆమెకు లభించినటువంటి గుర్తింపులు. అవి కాకుండా ఆవిడకి లభించినటువంటి గుర్తింపులని చెప్పుకోవాలంటే – ఇదిగో ఆవిడ ప్రారంభించిన సేవా సంస్థలు , ఆ సేవా సంస్థల ద్వారా ఉపాధి పొంది జీవితాలను చక్కదిద్దుకొన్న మహిళలు ఇచ్చిన ఆశీస్సులు ఆవిడకి ఈ బహుమతులు, పురస్కారాలు అన్నింటికీ కూడా ఎంతో విలువైనవి అని ఆవిడే చెప్పుకున్నారు.

ఆవిడ సమ్మింగ్ అప్ చేసినటువంటి జీవిత పాఠాల్లో ఏమిటంటే

" నేను. ప్రతిరోజు పడుకునే ముందు నేనొకసారి ఈ రోజులో జరిగినటువంటి విషయాలు ఏమిటి అనేది నేను పునర్విమర్శ చేసుకుంటాను.అలా సమీక్షించుకున్నప్పుడు , ఈ రోజు నేనేమైన తప్పు చేశానా? ఎవరిమీదైనా కోపగించుకున్నానా? ఆ కోపం అనవసరంగా కోపగించుకున్నానా? ఇలాంటి దాన్ని ఎలా సరిచేసుకోవాలి? ఈ తప్పులు పునరావృతం కాకుండా ఎలా చేసుకోవాలి? అని ప్రతి రోజు కూడా పడుకోబోయే ముందు సమీక్షించుకునేదాన్ని. ఆ విధంగా నన్ను నేను మెరుగు పరుచుకుంటూ వచ్చాను.

చేసేవి సంక్షేమకార్యక్రమాలైనా ,నాకెప్పుడూ అంతా సుఖంగానే జరిగింది. ఏవీ ఇబ్బందులు లేవు అని చెప్పడానికి కూడా లేదు. ఈ రాజకీయాల్లో ఉండగా ఎదురు తిరిగేవాళ్లు, అలాగే ఈ ప్రణాళికలకు ఎదురొచ్చేవాళ్ళు చాలామంది ఉండేవాళ్ళు .ఆ సమస్యలన్నింటిని కూడా పరిష్కరించుకొనే క్రమంలో కొంతమంది తో తగాదాలు కూడా వచ్చేవి .వాటన్నిటినీ పరిష్కరించుకొనే టప్పుడు కూడా నేను మానవత్వాన్ని కోల్పోకుండా ఉంటున్నానా? లేదా అని నేను ప్రతి క్షణం సమీక్షించుకునేదాన్ని" అని ఆవిడ రాసుకున్నారు.ఇంకో విషయం ఏం చెప్పారంటే, "ఏదైనా కానీ సంస్థను గాని, మనుషులతో గాని, బంధాలు కానీ, అనుబంధాలు కానీ శాశ్వతం అనుకోకూడదు.ఈ ప్రపంచంలో ఎవ్వరూ శాశ్వతం కాదు .ఎవరు ఎప్పుడు వెళ్ళిపోతారో తెలియదు.అందుకనే డిటాచ్మెంట్ అనేదాన్ని పెంచుకుంటూ ఉండాలి" .అని చెప్తూ "అందుకనే నేను మద్రాసులో నేనో సంస్థను స్థాపించాక. తర్వాత ఎప్పుడైనా వెళితే మద్రాస్ లో ఆంధ్ర మహిళా సభలో అందరూ సందర్శకులు కూర్చునే సిమెంట్ బెంచి మీద కూర్చుని మిగతావాళ్ళతో మాట్లాడేదాన్ని. కావాలంటే అక్కడ ఏ.సి.ఆఫీస్ లో కూర్చొని మాట్లాడొచ్చు కానీ నాకొకసారి దాన్ని స్థాపించి ప్రజలకిచ్చేశాక నాకు దానిమీద ఇంకా మమకారం, అధికారం ఉందని నేననుకోలేదు. నేను కూడా మామూలు

సందర్శకురాలినే అందుకనే మామూలు సిమెంట్ బెంచి మీద కూర్చొని మాట్లాడేదాన్ని. ఈ డిటాచ్మెంట్ అనేదాన్ని జీవితాంతం నేను మనసులో కొనసాగిస్తూ వచ్చాను" అని చెప్పుకున్నారు.

"ఏదైనా సంస్థ స్థాపించినప్పుడు నేనే దాన్ని పొడిగించాలి ఎప్పుడూ నేనే దానికి అధికారిగా ఉండాలి నా వల్లనే సంస్థ నడవాలి అని అనుకోకూడదు. నిజమైనటువంటి యజమాని ఎప్పుడూ సరైనటువంటి అధికారులను పెట్టుకోవాలి. సరైన పరిపాలనా విధానాలను రూపొందించాలి. సరైన వాళ్లకి ఆ సంస్థలను వదిలేసేయాలి. అలా అయితేనే ఆ సంస్థ పదికాలాలు నిలుస్తుంది. నేను చేసింది కూడా అదే. సమర్థులైనటువంటి వ్యక్తుల్ని నేను తీసుకోగలిగాను. వాళ్లకి సరైనటువంటి కోణంలో శిక్షణ ఇవ్వగలిగాను. సంస్థ యొక్క ఆశయాలువాళ్ళు కొనసాగించేలాగా చేయగలిగాను. అది మాత్రమే నా సామర్థత అనుకుంటాను . ఇప్పటిక్కూడా కొనసాగడం నా సమర్థత అనుకోను.అదంతా కూడా నేను తీసుకున్న వ్యక్తుల సామర్థ్యం" అని ఆవిడ చెప్పారు.

ఇంకొక విషయం ఏంచెప్పారంటే, "ఎప్పుడూ డబ్బులు విరాళాలొచ్చాక మనం పని చేద్దాం అని అనుకోకూడదు. సంకల్పం మంచిదైతే,విరాళాలు వాటంతట అవే వస్తాయి, నేను ప్రణాళిక మొదలు పెట్టేటప్పుడు ఎప్పుడైనా కానీ నా దగ్గర ఒక్క పైసా కూడా ఉండేది కాదు. నా దగ్గర వున్నదల్లా సంకల్పం, నిశ్చయం. నేను చేసే పనులు నిస్వార్థంగా చేస్తున్నాను అని నా అంతరాత్మ కి నేను చెప్పుకునేటటువంటి సమాధానం. అలా ప్రారంభించాక నిధులు వాటంతట అవే వచ్చాయి. ఇదే నేనందరికీ చెప్పదల్చుకుంది కూడాను. మీరు నిజాయితీగా సంఘసేవ కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రయత్నాన్ని దృఢమైన సంకల్పం తో ప్రారంభిస్తే మిలియన్ల,బిలియన్ల డాలర్లు వాటంతటకు అవే వస్తాయి. వీటికి ఉదాహరణ నేను చేసిన ఇటువంటి కార్యక్రమాలే." అని చెప్పారు.

అలాగే సి.డి.దేశ్ ముఖ్ గారిని కూడా తాను చేసేటటువంటి కార్యక్రమాల్లో భాగస్తుడిగా చేసి ఆవిడకి సహాయం అడగడానికి వచ్చేవాళ్ళకి కూడా ఆయనతో కూడా సహాయం చేయిస్తూ ఉండేవాళ్ళు. ఇంకోటి "నేనెప్పుడూ కూడా పనులు చేయడం మాత్రమే నమ్ముతాను ఉపన్యాసాలివ్వడంలో నాకు నమ్మకం లేదు. అందుకే నేనెప్పుడూ బహిరంగంగా ఉపన్యాసాలివ్వడం గాని నేను చేసేటటువంటి పనులకు ఎక్కువ ప్రచారం రావాలని గాని నేనెక్కువగా ఆశించలేదు. మనం మంచిపనులు చేస్తూ ఉంటె ప్రచారం దానంతట అదే వస్తూవుంటుంది" ఇవన్నీ మనకి అన్నీ తెలిసినవే కదా అనుకోవచ్చుండి కానీ ఈ విషయాలన్నీకూడా 1977 లో ఆవిడ అనారోగ్యం పాలై ఇంకా వెళ్ళిపోతానేమో అని అనుకున్న రోజుల్లో ఆవిడ చెప్పినటువంటి విషయాలు. ఆ రోజుల్లో ఇంకా దుర్గాబాయమ్మ గారిలాంటి నిస్వార్థపరురాలైనటువంటి సేవకులుండబట్టే,ఇంకా ఇదిగో కలికాలంలో ధర్మం కూడా నడుస్తుందంటారు.

ఆవిడ చేసిన పనుల గురించి ఏమన్నారంటే, "నేను చేసింది చాలా తక్కువ. సముద్రంలో నీటి బొట్టు మాత్రమే. చెయ్యాల్సింది చాలా ఉంది. ఈ మహిళలకి నా చేతనైనంతవరకు చేయగలిగాను. కానీ భారతదేశంలో మహిళల యొక్క సంక్షిక సంక్షేమం కానీ, మహిళల పరిస్థితి కానీ ఇంకా మెరుగు పరచాల్సినటువంటి అవకాశాలు చాలా ఉన్నాయి. అవసరం కూడా చాలా ఉంది. దీన్ని ముందుకు తీసికెళ్ళడానికి సంస్థలు కూడా తీవ్రంగా పనిచేయాలి" అని చెప్పారు. ఇంకొక విషయం,ఆవిడ చెప్పింది " ఇన్ని సంస్థలు స్థాపించటంలోనూ వీటిని ముందుకు తీసికెళ్ళడంలోనూ వీటన్నింటిలో కూడా నేను నేర్చుకున్నది ఏమిటంటే, పేషన్స్ ఈజ్ వర్చ్యూ టాలరెన్స్ ఈజ్ వర్చ్యూ ఓపిక ఉండాలి,సహనం ఉండాలి జాలీ, దయ, కరుణ ఉండాలి. అవి వున్నప్పుడు మాత్రమే ఇలాంటి పనులు చేయడానికి సాధ్యమౌతుంది" .అని చెప్పారు.చిట్ట చివరి సెంటెన్స్ ఆవిడ రాసిందేమిటంటే, "వుయి హావ్ ట్రయిడ్ టు లీవ్ అక్కార్డింగ్ టు సర్టన్ ప్రిన్సిపుల్స్ విచ్ వుయ్ హావ్ వాల్యూ అండ్ లైఫ్ హాజ్ గివెన్ అజ్ ఆంపుల్ రివార్డ్స్ " మనం కొన్ని సత్యాలని , కొన్ని ధర్మాలని నమ్మి నిజాయితితో జీవితాన్ని కొనసాగించేటప్పుడు జీవితం మనకు అన్నీ ఇస్తుంది. ఏంకావాలో అన్నీ ఇస్తుంది. అదే స్వార్థంకోసం అలాగే అంతా నాకే కావాలి అనుకుంటూ

వెళితే ఏం జరుగుతుందో తెలియదు కానీ నిస్వార్థంగా చేసినప్పుడు మాత్రం జీవితం ఇవ్వాల్సినవన్నిటినీ కూడా జీవితమే ఇస్తుంది అని చిట్టచివరి వాక్యం తోటి ఈ పుస్తకాన్ని ముగించారు.

మాట్లాడే రాళ్లు అని మరో పుస్తకం రాశారు దాంట్లో ఆంధ్రమహిళా సభ యొక్క పురోగతి గురించి చాలా వివరంగా చెప్పారు.అలాగే సి.డి.దేశ్ ముఖ్ గారు కూడా ప్రణాళికా సంఘం లోనూ, ఆర్థిక శాఖా మంత్రిగానూ , అలాగే విదేశాల్లో కూడా తిరిగొచ్చారు కాబట్టి ఆయన కూడా చాలా పుస్తకాలు రాశారు. ఆయన సంస్కృతంలో కవిత్వం రాస్తూఉండేవాళ్లు. సంస్కృత కవితా సమ్మేళనాలలో కూడా పాల్గొంటూ ఉండేవాళ్ళు.

.ఒక్కసారి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితాన్ని వెనక్కి తిరిగి మొత్తాన్నిసమీక్షించుకుంటే మూడు కోణాల్లో చూడొచ్చండి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితాన్ని.

ఒకటి ఆవిడ జీవితమంతా అంతా అంటే నూటికి నూరు శాతం సామాజిక సేవ,మహిళా సంక్షేమం కోసమే ఖర్చు పెట్టారు.చివరికి ఆవిడ కావాలనుకొని కట్టుకున్న ఇంటిని కూడా ఆవిడ ప్రభుత్వానికే ఇచ్చేసి వెళ్లిపోయారు. దేశ్ ముఖ్ గారు కూడా అదే దోవలో ప్రయాణించారు."సొంతలాభం కొంత మానుకు పొరుగువాడికి తోడు పడవోయ్" అన్నాడొక కవి. దుర్గాబాయమ్మ గారు మాత్రం తమ లాభాన్ని పూర్తి గా మానుకొని ఏదీ నాది కాదు నేను చేసేదంతా ప్రజలకోసమే ముఖ్యంగా మహిళల కోసమే అన్నట్లుగా ఆవిడ సేవ చేశారు.

రెండో కోణం ఆవిడ భర్తతో కలిసి చేసినటువంటి కార్యక్రమాలు మిగతా సంస్థలకి ఇచ్చినటువంటి సపోర్టు అవి ఎక్కువగా రికార్డ్ కాలేదు.ఆంధ్ర మహిళా సభే గుర్తొస్తుంది కానీ దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు చేసినటువంటి, భర్త తో కలిసి మిగతా సంస్థల యొక్క పురోభివృద్ధికి అవి నిలదొక్కుకోడానికి ఆవిడ చేసినటువంటి సహాయ కార్యక్రమాలు చాలా తక్కువగా కనిపిస్తూ ఉంటాయి. .ముఖ్యంగా I .I .S .S Indian institute of Statistical Sciences అది నిలదొక్కుకోడానికి కూడా సి.డి.దేశ్ ముఖ్ గారు చాలా సహాయం చేశారు. అలాగే I .I .P .M అని Indian Institute of professional Management అనుకుంటాను దానిని కూడా శాఖలు విస్తరించడానికి కూడా దేశ్ ముఖ్ గారు సహాయం చేశారు. National Committee on Girls and Woman Education అని దాని తరఫున భారతదేశమంతా కూడా లేడీస్ హాస్టల్స్ పెట్టారు. దానికి కూడా దుర్గాబాయమ్మ గారు చైర్మన్ గా ఉన్నారు

ఇంకా ఆంధ్రా మహిళా సభ గురించి మనం చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఆంధ్ర మహిళా సభ దానికి అనుబంధంగా పెరిగిన సంస్థలూ ఇవన్నీ కూడా ఆవిడ చేసినటువంటి మూడవ కోణం అని చెప్పుకోవచ్చు.

ఆవిడ ప్రభుత్వానికి ఇచ్చేసిన ఆవిడ స్వంత ఇల్లు డి.డి.కాలనీ లో ఉన్న ఇంట్లో ప్రస్తుతం మహిళా లా కాలేజీ నడుస్తున్నట్లుగా తెలిసింది.

ఇదండీ దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితం! నిస్వార్థం, పరోపకారం, సామాజిక సంక్షేమం గురించి, ఆవిడ ముఖ్యంగా మహిళాభ్యుదయం గురించి ఎప్పుడూ ఆలోచించడం వీటన్నిటినీ కూడా సాధించాలని అంటే, ఆవిడలో ఉన్నటువంటి నాయకత్వ లక్షణాలు , ప్రణాళికా బద్ధమైన , నిర్మాణాత్మకమైన సేవా కార్యక్రమాలు అవి మనం ముఖ్యంగా దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితం నుంచి మనం గమనించాల్సిన కొన్ని ముఖ్య లక్షణాలు. ఉద్యమాలు, ఉపన్యాసాలు, రాజకీయాలు పార్టీలూ, పుస్తకాలూ వీటన్నింటి కంటే కూడా ప్రాక్టికల్ గా ఏమి చేసి చూపించగలను? ఆచరణాత్మకంగా ఏమి చేసి చూపించగలను? ప్రణాళికా బద్ధంగా ఏమి నిరూపించగలను? అనే దృష్టితో ఆలోచించి, నిర్మాణాత్మకమైన కార్యక్రమాల్ని కొనసాగించి ఇప్పటికీ నిలిచేలాగా చేశారు దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు. సజీవంగా, చిరకాలం నిలిచేటటువంటి సేవాసంస్థలను నిర్మించిన మహిళల్లో ముఖ్యంగా ఏకైక మహిళగా దుర్గాబాయి దేశ్ ముఖ్ గారిని చెప్పుకోవచ్చేమో. ఆ రోజుల్లోకెళ్లి చూస్తే,మహిళా సంక్షేమం గురించి చేసిన వాళ్ళు చాలా మంది ఉన్నారు.ఏ మహిళల యొక్క పురోభివృద్ధి గురించి , దురాచారాలు

మాన్పించాలని ఉద్యమాలు చేసినవాళ్లు అలాగే చట్టాలు తెచ్చిన వాళ్ళు చాలామంది ఉన్నారు కానీ ఇలా ఆచరణాత్మకంగా సంస్థల్ని స్థాపించి పెంచి, పోషించిన వాళ్ళు వేళ్ళమీద దొరుకుతారేమో. అలాంటి వాళ్ళల్లో మొట్టమొదటి వరుసలో చెప్పుకోదగిన వ్యక్తి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు. ఇలాంటి వాళ్ళ గురించి ఈ తరానికి, రాబోయే తరానికి కూడా సరైన కోణంలో తెలియజేయాల్సిన బాధ్యత మనందరిమీద ఉంది అనుకుంటున్నాను. సరైన కోణం ఎందుకంటున్నానంటే,ఇలాంటి వాళ్ళ గురించి చెప్పేటప్పుడు ఏదో వాళ్ళ బయోడాటా చెప్పినట్లు గా వాళ్ళు చేసిన సేవల జాబితా కాకుండా,  జీవితంలో వాళ్ళు ఎంత నిబద్ధత తో పనిచేశారు ఎంత నిస్వార్థత తో పనిచేశారు ఎంత కమిట్మెంట్ తో పనిచేశారు ఈ క్రమంలో వల్ల వాళ్ళకొచ్చిన ఇబ్బందులు ఎలా అధిగమించారు – ఈ కోణంలో ఈ తరానికి , ముందు తరాలకి కూడా దుర్గాబాయమ్మ లాంటి వాళ్ళ జీవిత విశేషాల్ని మనం తెలియజేయాల్సిన బాధ్యత మనందరిమీద వుందనుకుంటున్నాను.

ఇదండీ దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి స్ఫూర్తిదాయకమైన జీవిత విశేషాలు గత నాలుగు భాగాలుగా తెలుసుకుంటున్నాం. ఇంతటితో ఈ కథ సమాప్తం.

**(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొడ్డు సత్యనారాయణ)**

2017 మార్చి 21 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS